02052025-MAI-04_Layout 1 5/2/2025 3:09 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి.
మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9
కృష్ణాపురం, రోడ్ నం.10,బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

దొందూ దొందే!

వంచనే పాలసీగా, మోసమే పాలనగా సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం తీరు, బీసీ కులగణన వ్యవహారంతో మరోమారు బయటపడింది. బడుగుల జనాభాను లెక్కించే విషయంలో కాంగ్రెస్ ఆడిన నాటకం కేంద్ర సర్కారు ప్రకటన సాక్షిగా బట్టబయలైంది. తెలంగాణలో కులగణన నిర్వహిస్తామని, దాని ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీల కోటాను 42 శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన దాదాపు ఏడాది తర్వాత, తూతూ మంత్రంగా బీసీ సర్వే పేరుతో ఒక తంతు నడిపించింది. సుప్రీం ఇచ్చిన ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాలను పక్కనబెట్టి, ఇష్టారాజ్యంగా, తప్పుల తడకగా, అసమగ్రంగా నిర్వహించిన ఈ సర్వేపై అప్పుడే అనేక అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. బీసీల జనాభాను తక్కువ చేసి చూపించాలనే విమర్శలూ వ్యక్తమయ్యాయి. అయినా పట్టించుకోని ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టి, ఆమోదం కోసం వాటిని కేంద్రానికి పంపింది.

శాసనసభలో ఈ బిల్లులకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన బీఆర్ఎస్, కేవలం బంతిని కేంద్రం కోర్టులోకి నెట్టేందుకు, బీజేపీని ఇరకాటంలో పెట్టేందుకు రాజకీయ ఎత్తుగడగా మాత్రమే కాంగ్రెస్ వీటిని వాడుకుంటున్నదని, ఈ బిల్లులకు కేంద్రం ఆమోదం లభించే అవకాశం లేనేలేదని నాడే తేల్చిచెప్పింది. అదే నేడు నిజమైంది. తాజాగా 2026లో జనగణనలో భాగంగా దేశవ్యాప్తంగా కులగణన కూడా నిర్వహించబోతున్నట్టు ప్రకటించిన కేంద్రం, కులగణన తమ పరిధిలోకి వస్తుందనీ, కొన్ని రాష్ట్రాలు రాజకీయ కారణాలతో చేసిన కుల సర్వే చెల్లుబాటు కాదని స్పష్టం చేయడం గమనార్హం. దీంతో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వే, దాంతో పాటు కేంద్రానికి పంపిన రిజర్వేషన్ల పెంపు బిల్లులు బుట్టదాఖలా అయినట్టే! అంటే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కోటా ఇప్పటికి సాధ్యం కానట్టే! పాలనలో విఫలమై ఏడాది కాలంలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, కోటా పెంపు లేకుండానే స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధపడుతుందా? లేక దీన్ని మరో సాకుగా చూపి వాయిదా వేస్తుందా? అన్నది తేలాల్సి ఉంది.

బీసీలపై కాంగ్రెస్ తీరు ఇలా ఉంటే, ఇక బీజేపీ మరోసారి పిల్లిమొగ్గల పార్టీగా రుజువు చేసుకుంది. మండల్ కమిషన్ సిఫారసుల విషయంలో ఆడిన దాగుడుమూతల పరంపరను కొనసాగిస్తున్నది. కులగణన జరపడమంటే దేశంలో, హిందూ సమాజంలో కులతత్వాన్ని ప్రోత్సహించడమేనని ఇన్నాళ్లూ వాదిస్తూ వచ్చిన బీజేపీ, అకస్మాత్తుగా జనగణనతో పాటు కులగణన కూడా జరుపుతామని ప్రకటించడానికి కారణం బీసీల్లో వస్తున్న చైతన్యమే. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో తగిలిన ఎదురుదెబ్బలు, రేపటి రాజకీయ అవసరాలు ఆ పార్టీ వైఖరిలో మార్పు తెచ్చాయే తప్ప బీసీలపై ప్రేమ కాదు. మొత్తమ్మీద బీసీల విషయంలో రెండు జాతీయ పార్టీలు దొందూ దొందే అని చెప్పాలి. బీజేపీని ఇరకాటంలో పెట్టేందుకు కాంగ్రెస్, కాంగ్రెస్ చేతుల్లోంచి ఎజెండా లాగేసుకునేందుకు బీజేపీ బీసీలను పావులుగా వాడుకుంటున్నాయే తప్ప, వారిపట్ల రెండు పార్టీలకూ ఎటువంటి నిబద్ధత లేదని ఈ ఉదంతం తేల్చింది. ఇది బీసీలు రెట్టింపు అప్రమత్తతో వ్యవహరించాల్సిన సమయం. ఏమరుపాటుగా ఉంటే, తెలంగాణలో కాంగ్రెస్ చేసిన మోసాన్నే, జాతీయస్థాయిలో బీజేపీ కూడా చేసే ప్రమాదం పొంచి ఉన్నది. తస్మాత్ జాగ్రత్త!!

తెలంగాణకు విలన్ ముమ్మాటికీ కాంగ్రెస్సే!

బాల్క సుమన్

అన్నం ఉడికిందో లేదో తెలియాలంటే అన్నం మొత్తాన్ని చూడనక్కరలేదు, ఒక్క మెతుకు ముట్టుకుంటే విషయం తెలిసిపోతుంది. అభివృద్ధి దిశగా దూసుకువెళ్తున్న రాష్ట్రానికి ఆటంకం కలిగించిన కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనా విధానంతో విఫలమైందనే విషయాన్ని చెప్పడానికి కూడా ఐదేండ్లు అవసరం లేదు, ఈ ఏడాదిన్నర కాలం సరిపోతుంది. అలవికానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలు విషయానికి వచ్చేసరికి అన్నింటా విఫలమైంది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ విషయాన్నే ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో తేటతెల్లం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'హైడ్రా'తో హైదరాబాద్‌ను అతలాకుతలం చేస్తే, సాగునీళ్లు, కరెంటు సక్కగ ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. ఇటు హెచ్‌సీయూ భూములను వేలం వేయడమైతేనేమీ, అటు పేదల ఇండ్లను కూల్చడమైతేనేమీ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబించిన అసమర్థ విధానాలు తెలంగాణ రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. అయితే, పారదర్శకంగా వ్యవహరించాల్సిన పోలీసులు ప్రభుత్వానికి వంతపాడటాన్ని కేసీఆర్ దుయ్యబట్టారు. మొత్తంగా రెండు జాతీయ పార్టీలు కలిసి తెలంగాణను ఆగం చేస్తున్నాయని ఆయన ఆవేదన చెందారు.

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) రజతోత్సవాల సందర్భంగా వరంగల్ సభకు వచ్చిన జన సందోహాన్ని, ఆ సభాస్థలి సాక్షిగా జనం రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన సందేశాన్ని, సభా వేదికగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రసంగానికి ప్రజల నుంచి వచ్చిన స్పందనను చూసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదలు, కాంగ్రెస్ మంత్రులు, నాయకుల దాకా ముచ్చెమటలు పట్టాయి. అందుకే ఏం మాట్లాడాలో తెలియక బీఆర్ఎస్ పార్టీపై, మా పార్టీ అధినాయకునిపై అవాకులు చవాకులు పేలుతున్నారు. ట్రాఫిక్‌తో బ్లాక్ అయిన అన్ని రహదారులతో పాటు లక్షలాది మందిని చూసి బిత్తరపోయిన అధికార కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష పార్టీని విమర్శించాలి కాబట్టి విమర్శిస్తున్నారు. అందుకే రజతోత్సవ సభకు ప్రజలు రాలేదని, బీఆర్ఎస్ పార్టీ గ్రాఫిక్స్‌లతో ప్రజలను మభ్యపెడుతున్నదని అసత్య ఆరోపణలు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రజలు 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టడంతో ప్రగతిభవన్‌ను హుందాగా వీడిపోయిన కేసీఆర్, కొత్త ప్రభుత్వానికి కొంచెం సమయం ఇవ్వాలని, ఇప్పుడే మాటల దాడులకు పాల్పడవద్దని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆర్నెళ్లో, ఏడాదో కాదు, సుమారు ఏడాదిన్నర గడువు ఇచ్చారు. ఈ నేపథ్యంలో యాదృచ్ఛికంగానే బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం కూడా వచ్చింది. పద్నాలుగేండ్ల పాటు పోరాటం చేసి, కొట్లాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని ఉద్యమ సారథి అయిన కేసీఆర్ సుమారు పదేండ్ల పాటు పాలనాపగ్గాలు చేపట్టారు. అయితే, ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రంలో అన్నిరంగాల్లో అగ్రపథాన దూసుకుపోయింది. ముండ్లబాటలో ఉన్న తెలంగాణను రాచమార్గానికెక్కించారు కేసీఆర్. ఇక్కడ ఒక్క విషయం ప్రస్తావించాలి. పురిటి నొప్పుల బాధ తల్లికే తెలుస్తుంది కానీ, సవితి తల్లికి తెలియదు. రాచమార్గంలో నడుస్తున్న తెలంగాణను రచ్చకీడిస్తే బాధ కేసీఆర్‌కు కాకుంటే కాంగ్రెస్ నాయకులకు ఉంటుందా? అందులో భాగంగానే ఏడాదిన్నరగా దిగమింగుకుంటున్న కేసీఆర్ తన ఆవేదనను వరంగల్ సభావేదికగా బయటపెట్టారు. ఆగమైపోతున్న తెలంగాణను చూసి ఆవేదన చెందారే గానీ ఎవరినీ విమర్శించలేదు.

కేసీఆర్ బాధ్యతాయుత ప్రతిపక్ష నేతగా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాదిన్నర సమయం ఇస్తే... ఇన్ని రోజులు కేసీఆర్ ఎక్కడున్నారని రాష్ట్ర మంత్రులు ప్రశ్నించటం వాళ్ల అవివేకమే అవుతుంది. బీఆర్ఎస్ గానీ, బీఆర్ఎస్ అధినేత గానీ ఏనాడు అభద్రతాభావానికి లోనుకాలేదు. వరంగల్ సభకు వచ్చిన ప్రజలను చూసే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభద్రతాభావంలో కొట్టుమిట్టాడుతున్నదన్న మాట నూటికి నూరు పాళ్లు నిజం. రజతోత్సవ సభ ఆసాంతం కేసీఆర్ ఎక్కడా వ్యక్తుల పేర్లు ప్రస్తావించలేదు. తెలంగాణ ప్రయోజనాలను కాంక్షించే మొదటి వ్యక్తిగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జరుగుతున్న నష్టాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రాన్ని సాధించి, పదేండ్లు కంటికి రెప్పలా కాపాడుకున్న ఆయన... ప్రస్తుత పాలనను చూసి ఆవేదనతో చెప్పిన మాటలను కాంగ్రెస్ నాయకులు అర్థం చేసుకోలేకపోతున్నారు. అయిన ఉద్యమాలో, పోరాటాలో, పదవులకు రాజీనామాలో, నిరసనలో నిర్వహిస్తేనే కదా తెలంగాణ అనే పదంలో ఉన్న ఆర్ద్రత అర్థమయ్యేది? కాంగ్రెస్ నాయకులకు ఆ తడి లేకే ఏడాదిన్నర కావొస్తున్నా తెలంగాణను ఓన్ చేసుకోలేకపోతున్నారు. రాష్ట్రాన్ని సొంత కుటుంబం వలె భావించే కేసీఆర్... కుటుంబ పెద్దగా... ఈ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని తెలియజెప్పేలా ప్రసంగించారు. కానీ, కాంగ్రెస్ నాయకులు అందులో ఉండే నిజా నిజాలను గ్రహించకుండానే విమర్శలు చేస్తున్నారు. పదే పదే బూతులు మాట్లాడుతూ ప్రజల మధ్యన పలుచనవుతున్నారు. సభలో కేసీఆర్ చేసిన విమర్శలపై ఎలాంటి సమాధానం ఇవ్వని మంత్రులు... సభ విజయవంతం కాలేదన్న విష ప్రచారంపైనే దృష్టిపెట్టారు. కాంట్రాక్టుల్లో, నిధుల విడుదలలో కమీషన్లు చేతులు మారుతున్నాయన్న దానిపై మౌనమే సమాధానమైంది. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి చివరికి రూ.12 వేలు కూడా సరిగా ఇవ్వలేకపోతున్నారు. పెంచి ఇస్తామన్న ఫించన్ కోసం దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఏడాదిన్నరగా పడిగాపులు కాస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి వివరణ లేదు. విద్యార్థినులకు స్కూటీలు, ఆడపిల్ల పెళ్లికి తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన మాట ఎక్కడ పోయింది. దళితబంధు ప్రస్తావనే లేదు. రైతులకు క్వింటాల్ వడ్లకు రూ.500 బోనస్ ఏమైంది?. ఇన్ని ప్రశ్నలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన కేసీఆర్‌నా విమర్శించేది?. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా పనిచేసిన కేసీఆర్‌కు, రాజకీయ ప్రయోజనాలు తప్ప ఏం పట్టని రేవంత్ రెడ్డికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉన్నది. ఆదివాసీల మరణాలపై మానవతా దృక్పథంతో స్పందించిన కేసీఆర్... ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపేయాలని కేంద్రానికి సూచించారు. ప్రజల తరపున కేంద్రప్రభుత్వానికి లేఖ రాస్తానని వరంగల్ సభ సాక్షిగా హామీ ఇచ్చారు. ఇది కదా మానవత్వం అంటే? ఇది కదా మానవీయం అంటే? కేసీఆర్ నోట కగార్ అనే మాట వచ్చేవరకు దాని గురించి తెలియని రేవంత్‌రెడ్డి హడావుడిగా అదే రోజు పెద్దలు జానారెడ్డితో సమావేశమయ్యారు. ఆ తర్వాత ఏం జరిగిందో మనకు తెలిసిన ముచ్చటే.

ప్రభుత్వ యంత్రాంగంపై ముఖ్యమంత్రికి గానీ, మంత్రులకు గానీ ఎవరికీ పట్టు లేదు. దగ్గాలన్నా, తుమ్మాలన్నా ఢిల్లీకి వెళ్లాల్సిందే. అలాంటి కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రజల సమస్యలను తీరుస్తారనుకోవడం మన పొరపాటే? దశాబ్దకాలం పాటు అన్ని రంగాల్లో నలు దిశలా విస్తరించిన తెలంగాణను అస్తవ్యస్థంగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నరగా కావస్తున్నది. కనీసం సొంతంగా మంత్రివర్గ విస్తరణ చేయలేని అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ప్రజలు ముచ్చట్లు పెట్టుకుంటుండటం కడు శోచనీయం. ఇక జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతులు గడించిన కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టుల్లో ఎలాంటి ఆధారాలు చూపించకుండా అవినీతి జరిగిందంటూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులు ఏడాదిన్నర గడుస్తున్నా ఏ ఆధారమూ చూపించలేకపోతున్నారు. కనీసం కాళేశ్వరం ప్రాజెక్టుకు రిపేర్లు చేసి రైతులకు నీళ్లిచ్చారా అంటే అదీ లేదు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతులు తిట్టని తిట్టు తిట్టకుండా తిడుతున్నారు. కాళేశ్వరం నిర్మాణం ద్వారా అదనంగా లక్ష ఎకరాల భూమి సాగులోకి వచ్చిందిన నీతి ఆయోగ్ ఇచ్చిన నివేదికనే బీఆర్ఎస్ ప్రభుత్వ పనితనానికి సాక్ష్యం. మేడిగడ్డలో అవినీతి జరిగిందని కేంద్ర సంస్థలు చెప్తున్నాయంటున్న నీటిపారుదల శాఖ మంత్రి ఆ నివేదికను బయటపెట్టాలి, లేదా తప్పుడు ఆరోపణలు చేసినందుకు ప్రజల మధ్యకు వచ్చి బహిరంగ క్షమాపణలు చెప్పాలి. బ్యారేజీ స్థల మార్పుపైనా ఆ పార్టీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారు. కేంద్ర జలసంఘం అనుమతితోనే బీఆర్ఎస్ ప్రభుత్వం అక్కడ బ్యారేజీని నిర్మించింది. రేవంత్ ప్రభుత్వం మాత్రం ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు చేపట్టి అక్కడి కార్మికుల మరణానికి కారణమైంది. కుటుంబాలు కనీసం మొహాలైనా చూసుకుందామని తాపత్రయపడుతుంటే కొంతమంది కార్మికుల పార్థివదేహాలు కూడా దొరకకుండాపోయాయి.

> అవును, కేసీఆర్ చెప్పినట్టు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి ఎప్పటికీ విలనే. 1969లో, 1972లో 2004లో, 2014లో ప్రతిసారి తెలంగాణ ప్రజలను వంచించిన పార్టీ బరాబర్ విలనే అవుతుంది. వేల మంది బలిదానాల తర్వాత, తెలంగాణ మహోద్యమాన్ని చూసి భయపడి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించిందే తప్ప, తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించి కాదు.

సోనియా ఇవ్వకుంటే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ మంత్రులు, నాయకులు తెలంగాణ ఉద్యమాన్ని అవమానిస్తున్నామన్న సంగతిని మరిచిపోతున్నారు. సోనియా గాంధే కాదు, ఆమె స్థానంలో ఎవరున్నా తెలంగాణ ఇవ్వాల్సిందే..? అన్ని పార్టీలని ఒప్పించి, అంతటి అనివార్యాన్ని సృష్టించింది, ప్రజల్లో ఆ ఊపును తీసుకువచ్చింది ఒక్క కేసీఆర్ మాత్రమే. ఇది చరిత్ర చెప్పిన సత్యం.

(వ్యాసకర్త: చెన్నూరు మాజీ శాసనసభ్యులు)

ఎజెండా ఎప్పుడూ మారలేదు..

లక్ష్మీహరిత ఇంద్రగంటి

తెలంగాణ అణచివేత చరిత్ర కావచ్చేమో కాని, తాము సాధించిన అభివృద్ధిని చరిత్రలో కనుమరుగు కానీయబోమన్నదే మొన్నటి ప్రజాసభలో తెలంగాణ సాధకుడు కేసీఆర్ నిండు గుండెతో పలికిన మాటల అంతరార్థం. పోరాడి గెలుచుకొని, బంగారంలా మలుచుకున్న తెలంగాణ పరిస్థితి మళ్లీ మన్నులబడ్డట్టవుతున్నదని చెప్పాలంటే ఆయన గొంతు గద్గదమైంది. తెలంగాణపై ఆయనకు ఉన్న ఈ ప్రేమే ఉద్యమ పార్టీ స్థాపనకు పురిగొల్పింది.

బీఆర్ఎస్ రజతోత్సవ సభలో... మళ్లీ పాత కష్టాలనే కలబోసుకోవాల్సి రావడం బాధాకరమే అయినా, 'తెలంగాణ సమాజం అద్భుతంగా పురోగమించే వరకూ మనం పనిచేస్తూనే ఉండాలంటూ'... ఎల్కతుర్తి వేదిక సాక్షిగా ఆయన చేసిన మహా సంకల్పం, ఆ ప్రాంగణాన్ని గులాబీ వర్ణమయంగా మార్చిన లక్షలాది ప్రజానీకానికే కాదు, యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎనలేని భరోసానిచ్చింది. ఆనాడైనా, ఈనాడైనా ఉద్యమ జెండా, ఎజెండా ప్రజా సంక్షేమమేనని మరోసారి చాటిచెప్పింది.



సాధారణంగా అధికార పార్టీ సమావేశాలకు, ఎన్నికల ముందు జరిగే సభలకు పెద్ద ఎత్తున జనం తరలిరావడమన్నది మనం గమనిస్తాం. కానీ, ఒక పార్టీ పాతికేండ్ల పండుగకు జన జాతర అనగలిగేలా ప్రజానీకం పోటెత్తడం ఓ అరుదైన సన్నివేశం. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లక్షల సంఖ్యలో ప్రజలు తరలి రావడానికి ఆ పార్టీ మీద ప్రేమ ఒక్కటే కారణం కాదు, ఆ పార్టీ అధినేత మీద ఉన్న విశ్వాసం కూడా కారణమే. ఆయన సాగించిన పోరాటాలు, సాధించిన విజయాల మీద భరోసా. కష్టమంటే కడుపులో పెట్టుకొని చూసుకునే, ఉద్యమం అంటే ఉరికొచ్చే జెండా ఉన్నదన్న ధైర్యం. మళ్లీ మొదటికొచ్చిన తెలంగాణ విషయంలో కేసీఆర్ ఏం ఆలోచన చేస్తున్నడో తెలుసుకోవాలన్న కుతూహలం. ఇందులో ఒక్క నమ్మకమూ వమ్ము కాలేదు. వచ్చిన ఏ ఒక్కరి మనసూ చిన్నబుచ్చుకోలేదు. అప్పుడైనా ఇప్పుడైనా కేసీఆర్ తెలంగాణ కోసం ఆలోచిస్తడు, పాతికేండ్ల కిందటైనా ఈ రోజైనా ఉద్యమం అంటే బీఆర్ఎస్ పిడికిలి ఎత్తుతుందన్న విశ్వాసం ప్రతి ఒక్కరిలో కలిగించేలా సాగింది ఓరుగల్లులో పోరుబిడ్డ ప్రసంగం. అవును, అక్కడున్నది కేసీఆర్ మరి! చిమ్మ చీకట్లను ధిక్కరిస్తూ ధగ ధగా మెరుస్తున్నది ప్రజల గుండెల్లోని ఆ గులాబీ జెండా.

> సాధించుకున్న తెలంగాణను పసిడి సిరుల సీమగా చేయాలని గోదావరికి మొక్కి కాళేశ్వరాన్ని భుజానికెత్తుకున్నారు. కరువు సీమ పాలమూరుకు పరిగెత్తే నీళ్లను పరిచయం చేశారు. విద్యుత్తు వెలుగులు 24 గంటలూ విరబూయించారు.

ప్రతి జెండాకూ ఓ ఎజెండా ఉంటుంది. తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలుంటాయి. ఆకాంక్షలూ, ఆశయాలూ సుస్పష్టంగా నిర్దేశితమవుతాయి. కచ్చితమైన లక్ష్యాలూ ఉంటాయి. వాటన్నింటికీ ఆకర్షితులైనవాళ్లు ఆ జెండా కింద చేరుతారు. తామంతా ఒక్కటన్న భావనతో సాగుతారు. ఎత్తుపల్లాలను ముందే ఊహించి తమను ముందుకు నడిపే ఒక్క దమ్మున్న తోడున్నా, ఆ జెండా సాక్షిగా అందరి ఆశలూ నెరవేరినట్టే. తెలంగాణ విషయంలో, ఆ ఒక్క మనిషి మన బక్క మనిషి కేసీఆర్ అయితే, ఆ దారి చూపింది రెపరెపలాడే గులాబీ జెండానే. బీఆర్ఎస్ జెండా విషయంలో ప్రాథమిక లక్ష్యం రాష్ట్ర సాధన అయితే, శాశ్వత లక్ష్యం మాత్రం ప్రజా సంక్షేమమే. వేరుపడి వెక్కిరింతలకు గురైన చరిత్ర తెలంగాణది కాకూడదని తొలి రోజు నుంచే పనిచేశారు కేసీఆర్. సాధించుకున్న తెలంగాణను పసిడి సిరుల సీమగా చేయాలని గోదావరికి మొక్కి కాళేశ్వరాన్ని భుజానికెత్తుకున్నారు. కరువు సీమ పాలమూరుకు పరిగెత్తే నీళ్లను పరిచయం చేశారు. విద్యుత్తు వెలుగులు 24 గంటలూ విరబూయించారు. ఐటీ ఎగుమతుల్లోనూ మేటిగా నిలిపారు. మొత్తానికి అభివృద్ధికి అడ్డాగా తెలంగాణను మలిచారు. కానీ, కాంగ్రెస్ గద్దెనెక్కాక తీరూ తెన్నూ లేని పాలనతో అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉన్న తెలంగాణను రాష్ట్రాల జాబితాలో పదిహేనో స్థానానికి పడిపోయేలా చేయటమన్నది మళ్లీ ఉమ్మడి రాష్ట్రం కాలం నాటి పరిస్థితులను పునరావృతం చేయడమే. అందుకే కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి ఉండంగ ప్రజలు మంచినీళ్లకు గోస పడాల్సిన అవసరం ఎందుకొచ్చిందని గద్దించి అడిగారు కేసీఆర్.

> పొలం ఉన్న ప్రతి రైతూ ఆస్తి పరుణ్ని అని భావించిన రోజులను జ్ఞప్తికి తెచ్చారు. పదవులు తనకు లెక్క కాదనీ పదవీ త్యాగంతోనే తెలంగాణ ఉద్యమం మొదలైందని గుర్తుచేశారు. పోరాటం విషయంలో తన పంథా ఏమిటో చెప్పారు. గులాబీ జెండా పాతికేండ్ల పండుగ సాక్షిగా బీఆర్ఎస్ ప్రజా సంక్షేమానికి పునరంకితమవుతుందని ఢంకా బజాయించారు.

పరాయి పాలనలో ప్రజలకు కష్టం వచ్చిన ప్రతిసారీ గులాబీ జెండా అండగా ఉన్నది. ఇప్పుడు కూడా పాలకులు తప్పు చేస్తే గాడిలో పెట్టే బాధ్యత తీసుకుంటున్నది. ఉద్యమం అన్నది జెండా ఊపిరిలోనే ఉన్నదని ఎల్కతుర్తి సభ మరోసారి రుజువు చేసింది. ఎందుకంటే ఈ గులాబీ వర్ణం రాజప్రాసాదాల పూదోటల నుంచి పుట్టింది కాదు, ఒక ప్రాంతపు ప్రజలు ఎదుర్కొన్న అవమానాలు, అన్యాయాలు, వివక్షల సాక్షిగా సంతరించుకున్నది!

కేసులుంటేనే ఉద్యమకారులా?

2019, సెప్టెంబర్ 17 నుంచి 'తెలంగాణ ఉద్యమకారుల ఫోరం' చేసిన కృషి ఫలితంగానే కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యమకారుల అంశాన్ని ప్రస్తావించింది. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి అమరుల విషయమై ఇంకా స్పష్టమైన ప్రకటన ఏదీ రాకపోవడం శోచనీయం. అయితే, పేరుకు మాత్రం 'ప్రజాపాలన' దరఖాస్తు ఫారంలో ఉద్యమకారులపై నమోదైన కేసుల వివరాలను సేకరించింది. దీంతో కేసులు లేని తెలంగాణ ఉద్యమకారులు ఆందోళనకు గురవుతున్నారు. పిల్ల పుట్టకముందే కుల్ల కుట్టినట్టుగా ఉద్యమకారులకు ఏ రకమైనటువంటి సహాయం చేయకుండా నిబంధనలు విధించేసరికి ఉద్యమకారులు ఆవేదన చెందుతున్నారు. కేసులు, జైలుశిక్ష ప్రాతిపదికన ఉద్యమకారులను గుర్తించడం రాజ్యాంగ విరుద్ధమే.

ఉదాహరణకు ఉత్తరాఖండ్‌ను తీసుకున్నట్టయితే, అనేక ఉద్యమాలతో 2000, నవంబర్ 9న రాష్ట్రంగా ఏర్పాటైంది. రాష్ట్రం సిద్ధించిన అనతి కాలంలోనే అప్పటి ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి అందరికీ ఉచిత బస్‌పాస్‌లు, విధానసభ సచివాలయంలోకి ప్రత్యేక ప్రవేశాలను కల్పించింది. ఉద్యమకారులకు జిల్లా మేజిస్ట్రేట్ గుర్తింపు కార్డులు జారీచేసింది. అంతే కాదు, 7 రోజులు, ఆపై జైలు శిక్ష అనుభవించినవారికి, ఉద్యమంలో గాయాలపాలైన వారికి తమ తమ విద్యార్హతలను బట్టి ఎలాంటి పరీక్ష లేకుండానే గ్రూప్-3, గ్రూప్-4 పోస్టుల్లో ఉద్యోగాలు కల్పించింది. వారం రోజుల కన్నా తక్కువ జైలు శిక్ష అనుభవించినవారికి గ్రూప్-4 నుంచి గ్రూప్-1 వరకు అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించింది. యాభై ఏండ్లకు పైబడిన ఉద్యమకారుల కుటుంబీకులకూ ఇవే నిబంధనలు వర్తింపజేసింది.

2007లో కరుణేష్ జోషి, 2009లో నారాయణ్‌సింగ్ రానా అనే ఇద్దరు వ్యక్తులు రిట్ పిటిషన్‌లు దాఖలు చేశారు. దీంతో ఆ రాష్ట్ర హైకోర్టు ఆ జీవోలు రాజ్యాంగంలోని ఆర్టికల్-309కు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొనడంతో హైకోర్టు సూచనలను పాటించింది. ఈ నిబంధనల ప్రకారం ఉద్యమకారులకు రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరిధి దాటి గ్రూప్-3, గ్రూప్-4 ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించింది. తదనంతర జీవోల ద్వారా రిజర్వేషన్లు ఉద్యమకారుల కుటుంబ సభ్యులందరికీ వర్తిస్తాయని చెప్పింది. అయితే, రాష్ట్ర హైకోర్టు ఉద్యోగాలు పొందినవారి డేటాను పరిశీలించి, శాంతియుతంగా ఉద్యమం చేసిన అమాయకులకు, పరపతి లేనివారికి ఉద్యోగాలు ఇవ్వలేదు, రౌడీలకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొన్నది. అయితే, ప్రభుత్వం ఉత్తరాఖండ్ ఉద్యమకారులు, వారిపై ఆధారపడిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ చట్టం 2015 ముసాయిదాను తయారుచేసింది. రాష్ట్ర అసెంబ్లీ 2016లో ఆ బిల్లును పాస్ చేసింది కానీ, గవర్నర్ ఆమోదం పొందలేదు. 2017లో హైకోర్టు డివిజన్ బెంచ్‌లోని ఇద్దరు జడ్జీలు భిన్నాభిప్రాయాలు తెలిపారు. మొత్తంగా ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉద్యమకారులను నిర్ధారించడంలో శాస్త్రీయత, తార్కికత లేకపోవడం కనిపించింది. దీన్నిబట్టి మన తెలంగాణ ప్రభుత్వం కూడా తగు జాగ్రత్తలు తీసుకొని ఆర్టికల్-14, 16 లకు భంగం కలగకుండా ఆర్టికల్-309 ప్రకారం ఉద్యమకారులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించాలి. అంతేకాదు బహిరంగ నోటిఫికేషన్ జారీచేసి, నిర్ణీత గడువులోగా ఉద్యమకారులని భావించే వారందరి నుంచి సెల్ఫ్ అటెస్టెడ్ అఫిడవిట్‌తో ఉన్న దరఖాస్తును స్వీకరించాలి. అలా స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్రంగా విచారణ జరపాలి. తప్పుడు అఫిడవిట్‌లు సమర్పించిన దరఖాస్తు దారులను కఠినంగా శిక్షించాలి. తద్వారా తేలిన నిజమైన ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీచేయాలి. తెలంగాణ ప్రభుత్వం ఈ విషయాలను పరిగణనలోకి తీసుకొని నిజమైన ఉద్యమకారులకు సరైన న్యాయం చేస్తుందని ఆశిద్దాం.